# వింత ప్రేమ

సత్రంమూల వెలుగుతున్న ఆరిపోయే దీపం మరణ కాంతిలో, పడుకున్న పాంధులు మసక మసకగా కనిపిస్తున్నారు. సున్నం రాలిపోయిన గోడలకి చేరగిలబడి కొందరు అనాధలు నిద్రరాని అయోమయ స్థితిలో ఉన్నారు. రాత్రి పన్నెండు కావస్తోంది. చీకటి ఆవరించిన గదుల్లోంచి గల్లంతుగా మూలుగు, రెండు మూడు దెబ్బలూ వినవచ్చి నిశ్శబ్దాన్ని భగ్నంచేసినై. బైట వరండాలో పరుపులకి శరీరాల్ని జేర వేసివున్న నలుగురు నాగరికులు అటూ ఇటూ పొర్లి ''దొంగలు పడలేదుకదా'' అనుకున్నారు దిగులుగా. వాళ్ళ చేతులు ఆటోమాటిక్‌గా జేబులు తడువుకున్నాయి. ఎడం పక్క రెండవ గదిలోంచి గోల సద్దుమణిగినట్లు నిశ్వాసలూ, నవ్వులూ వినపడ్డాయి.

నలుగురు నాగరికుల్లో చిట్టచివర పడుకున్న సుబ్బయ్య పక్కమీద లేచి కూర్చుని సిగరెట్ అంటించి నిప్పు వెలుగులో తనపక్కన పడుకున్న వెంకట్రావును ఉద్దేశించి ''సత్రంలో గోల ఉండవచ్చు - కాదనను. కాని అర్ధరాత్రి పూటా - దాంతగ లెయ్యా'' అన్నాడు విసుగ్గా.

వెంకట్రావు నిద్రమత్తులో ఒకసారి వొళ్ళు విరుచుకుని ''అసలా గోలేమిటి? బహుశా ఏ జంటలదో ప్రణయం కాదు గదా?'' అన్నాడు ఆశ్చర్యం, హాస్యం ధ్వనిస్తో.

సుబ్బయ్య ఉలిక్కి పడ్డాడు. ప్రణయమా? దెబ్బలూ మూలుగులూ ఏమిటి ప్రణయమేమిటి అని తర్కిస్తో, ''మీదంతా వేషం. ఓ పక్క ఏడ్పు వినిపిస్తోవుంటే ప్రణయ మేమిటి?'' అన్నాడు.

'నేనుకున్నాను అంతే. కాకపోవచ్చు ఒకవేళ అయినా ఆశ్చర్యపడాల్సిన అగత్యం ఉండదు'' అన్నాడు వెంకట్రావు దృఢంగా, ఏ అనుభవాల్ని పురస్కరించుకుని చెబుతున్నాడో మరి!

సుబ్బయ్య మళ్ళీ పక్కమీద వాలుతూ ''ఏదైతే ఎవడిక్కావాలిగాని, దొంగలు కాకపోతే సరి!'' అన్నాడు.

''మరే'' అంటో వెంకట్రావు పడుకున్నాడు, శాంతంగా.

పది నిమిషాలు నిశ్శబ్దంగా గడిచినై. గాలి విసురుకి దీపం కాంతి చీకట్లో నిశ్రమించింది. మళ్ళీ అదే గదిలోంచి ఇదివరకుకంటే దారుణంగా మూలుగు, అర్థం కాని తిట్లూ వినిపించినై.

ఈ తడవ బైట నలుగురూ తప్పనిసరిగా లేచి కూర్చున్నారు. వెంకట్రావు ''ఏమిటిది? ఖూనీగాని జరగటం లేదుగదా!'' అని భయపడ్డాడు.

''ఏదైనా కావచ్చు'' అన్నాడు మీసాలు తలా నెరిసిన ముసిలాయన ఒకడు. సుబ్బయ్య తలాపున వున్న బ్యాటరీ లైటు తీసి ఎడం వేపు గదుల వాకిళ్ళమీద ప్రసరిస్తో ''పోయి చూదాం పదరండి. ఆడగొంతులావుంది'' అన్నాడు.

మిగతా ముగ్గురూ జంకేరు. కారణం వెనకటి మూలుగుకి బదులు అవ్యక్తంగా నవ్వులూ ముద్దులని గుర్తుపట్టడానికి వీలయ్యే శబ్దాలూ వినపడ్డాయి.

''చచ్చాంరా! పరమాత్మా. ఇది ఖూనీకాదు గాడిద గుడ్డూగాదు. ఏదో ప్రణయమే. నిద్ర చెడగొట్టుకోడం దండుగ'' అన్నాడు సుబ్బయ్యకూడా. నలుగురూ యిక పిడుగులుపడ్డా లేవకూడదని శపథం చేసుకొని నిద్ర పోయినారు.

అరగంట గడవకముందే నలుగురూ బూట్ల చప్పుడికి లేవక తప్పిందికాదు. వాళ్లు కళ్ళు తెరచి చూచేటప్పటికి కాంతివంతమయిన గ్యాస్‌లైటు చేతపట్టుకొని ఇద్దరు పోలీసులూ, ఓ సబిన్స్పెక్టరూ ఎడం వేపు గదుల ముందుగా నడుస్తున్నారు. సత్రం యిక అన్ని విధాల నిశ్శబ్దంగా వుంది. సత్రం గుమాస్తా పట్టవర్ధనాచార్యులు చిన్న బొర్ర వణుకుతో వుంటే వాళ్ళ వెనకాల నడుస్తో గైడెన్సు ఇస్తున్నాడు. సుబ్బయ్య ఆత్రంగా లేచి వాళ్ళ వైపుగా పరుగెత్తుకు వెళ్ళాడు. రెండవ గది దగ్గిరికి వెళ్ళి అందరూ ఆగిపోయినారు. సబ్ ఇన్స్పెక్టర్ నిశ్శబ్దముగా వుండమని సంజ్ఞచేసి తలుపుమీద చెవి పెట్టి వింటున్నాడు ఏమిటో. బయట నుంచున్న వాళ్ళకి ఆదుర్దా హెచ్చుతోంది. మళ్ళీ 'మూలుగు, అబ్బ - అబ్బ - అన్న విషాద స్త్రీ స్వరం నిశిరాత్రిని భయపెడుతున్నై. నలుగురు నాగరికులూ ఒకర్నొకరు సాభిప్రాయంగా చూసుకున్నారు. ''ఏం జరుగుతున్నది?'' అందరి ఆదుర్దా ఇదే.

లోపల్నుంచి స్పష్టమయిన మాటలు వినపడ్డయ్. ఒక అధికారస్వరం ''పడుకో ... లేకపోతే చంపుతాను'' అంటోంది. ఇది మగస్వరమని తెలుస్తోనేవుంది.

''అమ్మయ్యో... వొదులు ... చచ్చిపోతాను... నెత్తురొస్తోంది ... అమ్మో...'' అంటోంది స్త్రీ ధ్వని హృదయ విదారకంగా వినిపిస్తోంది బైటివాళ్ళకి.

సబ్ ఇన్‌స్పెక్టర్ ఒక్కసారిగా అటెన్షన్‌లో నిలబడి ''రేప్...'' అంటో ఒకడుగు వెనక్కి వేసి తలుపును ఒక్కతన్ను తన్నాడు.

గడియలు ఎప్పటివో పురాతనమైనవి గావున దభేలున ఊడిపోయి తలుపు బార్లా తెరుచుకుంది. గ్యాస్‌లైట్ వెలుగులో లోపల కుక్కిమంచం మీద పద్దెనిమిది పంధ్తొమ్మిదేళ్ళున్న ఓ అమ్మాయి, ఆమె పక్కన 26, 27 ఏళ్ళు ఉన్న యువకుడూ పడుకుని వున్నారు. ఈ గ్యాస్ లైటునీ మనుషుల్నీ చూసేటప్పటికి దాదాపు నగ్నంగా ఉన్న యిద్దరూ చప్పున కాళ్ళకట్టన ఉన్న దుప్పటి కప్పుకున్నారు సిగ్గుతో.

ఈ దృశ్యం ఇన్‌స్పెక్టరులో కోపాన్ని మరీ రెచ్చకొట్టింది. నాగరికులు నలుగురూ

స్తంభించిపోయినారు క్షణం. కారణం ఆ అమ్మాయి మొహం నిండా అక్కడక్కడ నెత్తురు మరకలు. దుప్పటి కప్పుకోక ముందు రొమ్ము మీద కూడా ఇట్లాంటి మరకలే కన్పించినాయి.

ఏమీ తోచకుండా ఉన్న ఈ ఐదు నిమిషాలలో కుక్కిమంచంమీద యువకుడు లుంగీ వొదులుగా బిగించుకొని మంచం దిగాడు. అ అమ్మాయి మాత్రం సిగ్గుతో, ఎవరివంకా చూడలేక దుప్పటి మొహానికి కప్పుకుంది.

పరిస్థితి గ్రహించుకున్న సుబ్బయ్య గ్యాస్‌లైట్ పట్టుకునుంచున్న పోలీసును ''ఒక్కరవ్వ బైటికి పో, ఆ అమ్మాయి.. '' అన్నాడు మెల్లగా. గ్యాస్ లైట్లతోటే అందరూ బైటికి వచ్చారు. యువకుడు వెనక్కి చూస్తూ ఇన్‌స్పెక్టరుని వెంబడించాడు.

దీపం కిందపెట్టి, గదిబైట ఆగాడు పోలీసు. ఇనస్పెక్టర్ అధికార పూర్వకంగా ఆ యువకుడి కాలర్ బలంగా చేత్తో పట్టుకుని ముందుకిలాగి '' ఏంచేస్తున్నావు ఆ అమ్మాయిని?'' అని అడిగాడు భయంకరంగా గర్జిస్తూ.

తెల్లబోయాడు యువకుడు. అతనికి ఏమీ అర్థం గావడం లేదు, ఆ పోలీసులు ఈ పెద్దమనుషులు.

''చెప్పవేం?...'' ఒకటిచ్చుకున్నాడు చెంపమీద ఇనస్పెక్టర్.

దెబ్బతో ఎర్రబడ్డ చెంప తడువుకుంటున్న యువకుడి నోరూ, పెదాలు చుట్టూ నుంచున్న వారికి చూపిస్తూ, ఇనస్పెక్టరు ''చూడండి, ఆనోటి నిండా రక్తం ఎట్లా ఉందో'' అన్నాడు. చూసేవాళ్ళకి వొళ్ళు ఝల్లు మంది. ఇందాక ఆ అమ్మాయి వొంటి మీద చూసిననెత్తురు మరకలు జ్ఞాపకం వచ్చినాయి సుబ్బయ్యకి, వెంకట్రావుకీ. ''రాక్షసుడు!'' అన్నాడు సుబ్బయ్య.

''ఆ అమ్మాయిఎంత గోల పెట్టింది! వీణ్ణి నరికెయ్య!'' అన్నాడు ముసలాయన.

''ఔనండి, ఆగోలకే నేను పోలీసు స్టేషన్‌కు పరిగెత్తాను'' అన్నాడు ఆ అమ్మాయికి సానుభూతిగా పట్టవర్ధనా చార్యులు.

ఇనస్పెక్టర్ యువకుణ్ణి, చొక్కా పట్టుకుని మళ్ళీ ఒకసారి గట్టిగా ఊపి ''నీ పేరేమిటి?'' అని అడిగాడు. పక్కనే నిలబడ్డ 364 పెన్సిల్, కాయితం తీశాడు వివరాలు రాయడానికి. యువకుడు భయవిహ్వలుడై, నత్తిగా మాట్లాడుతో ''సాంబశివరావు'' అన్నాడు.

''ఊఁ.... ఆ అమ్మాయి ఎవరు?'' ఇనస్పెక్టర్ కళ్ళు నిప్పులు కక్కుతున్నై. న్యాయరక్షకుడుగదా!

సాంబశివరావుకి బొత్తిగా నోట మాట రావటం లేదు.

ఇనస్పెక్టర్ విసుగ్గా పక్కనే నుంచున్న పెద్దమనిషి సుబ్బయ్యను ఉద్దేశించి ''ఆ అమ్మాయిని నేను పిలుస్తున్నానని పిలవండి, ఏం భయం లేదని చెప్పండి'' అన్నాడు.

సత్రంలో ఉన్న వాళ్ళు దాదాపుగా అక్కడికి చేరి వున్నారు. గంభీరమైన సందడి ఆవరించుకుంది సత్రాన్ని.

సుబ్బయ్య గదిలోకి వెళ్ళకుండా బైట నిలబడి కాస్త మాటలకోసం తడుములాడుకుని ''అమ్మాయిగారూ! ఒక్కసారి ఇలా రండి'' అన్నాడు.

చీకటి గదిలోంచి ఆ అమ్మాయి మెల్లిగా బైటికి వచ్చింది భయపడుతూ, ఐదారు అడుగుల దూరంలో నిలబడి వున్న జనసమూహం.... సబ్ ఇనస్పెక్టర్... ఆ అమ్మాయి బాగా సిగ్గుపడిపోయి అడుగు వెయ్యలేక నేల చూపులు చూస్తూ నిలబడిపోయింది.

ఇనస్పెక్టర్ ఆ అమ్మాయి స్థితిని ఊహించుకుని జనసమూహాన్ని తోసుకుని సాంబశివరావును లాక్కొచ్చి ఆ అమ్మాయిముందు నిలబెట్టి, ''వీడు ఎవడమ్మా? నిన్ను బలవంతం చేశాడుగదూ! అని అడిగాడు.

ఆ అమ్మాయి ఉలిక్కిపడి సాంబశివరావు కళ్ళల్లోకి చూసింది జాలిగా, కాని మాట్లాడలేక పోతోంది.

ఇనస్పెక్టర్ నిర్ధారణగా ''నేను చెప్పలేదండీ? వీడు రోగ్... ఈ అమ్మాయిని ఎక్కణ్ణించో లాక్కొచ్చాడు....'' అన్నాడు పెద్దమనుషులవంక చూస్తూ.

ఆ అమ్మాయి మరింతగా కంగారు పడ్డది. సాంబశివ రావు గాబరాగా, ''చెప్పు'' అన్నాడు మాట తెమలి.

జనసమూహం ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఇనస్పెక్టర్ ''చెప్పు, వీ డెవడూ?'' అన్నాడు కాస్త గట్టిగా.

''మా ఆయన'' అంది తలవంచి.

జనసమూహంలో పిడుగు పడ్డట్టయింది.

ఇనస్పెక్టర్ సాంబశివరావు చొక్కా వదిలాడు. ఆయన మొహంలో కత్తి వేటుకి నెత్తురు లేదు.

★ ★ ★ ★

సత్రంలో పోలీసులు నిష్క్రమించినందువల్ల నిశ్శబ్దం అయింది. సాంబశివరావు కోపంతో చేతులు రుద్దుకుంటూ వరండాలో స్తంభాన్నానుకొని నుంచున్న సుబ్బయ్యతో మాట్లాడుతున్నాడు. సత్రం గుమాస్తా, క్షమార్పణ వేడే చూపు పెట్టి ఐదారు అడుగుల దూరంలో నుంచున్నాడు.

''అదికాదండీ, నా పెళ్ళాంతో సరసాలాడితేనే పోలీసులకి కబురు చేస్తారండీ?'' అన్నాడు సాంబశివరావు కోపంగానే.

సుబ్బయ్య నవ్వుతూ ''అది సరసమని నేను అనుకోలేదులెండి'' అన్నాడు వ్యంగ్యంగా. సాంబశివరావు మొహం వివర్ణమైంది.

వెంకట్రావు ''సిగ్గుపడకండి. ఇట్లాంటి సరసాలుంటాయని ఏదో పుస్తకంలో చదివేను నేను'' అన్నాడు లౌక్యంగా.

సాంబశివరావు ఊతం దొరికినందుకు ఉషారుగా, ''నేనూరుకున్నా అది ఊరుకోదండి, కొరుకుతుంది. నేనూ అంతేలెండి - నా కప్పుడు మృగాలు ఆవేశిస్తాయో ఏమో తెలియదు గొడవ'' అన్నాడు.

'' ఇద్దరూ సరిపోయినారు'' అంటూ సుబ్బయ్య నవ్వాడు సన్నగా.

''మరేనండి!'' అంటూ సాంబశివరావు మళ్ళీ తన గదిలోకి వెళ్ళిపోయినాడు. వెంకట్రావు ''నేను చెప్పలేదటోయ్, ఇదొక రకం ప్రణయమనీ!'' అంటూ మళ్ళీ హోల్డాల్‌కు శరీరాన్ని జారేశాడు.

*('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)*